


# కరపత్రం

SINCE 2014

శనివారం మార్చి 28, 2026 సంపుటి : 2 సంచిక : 166 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

# కమనీయం..సీతారామ కళ్యాణం

- మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సిఎం దంపతులు
- రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు
- పలవురు మంత్రులు, ప్రముఖుల రాక





**భద్రాచలం,మార్చి 27 :**
శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్చారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరపున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

2లో..

## అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

- బాలరాముడిపై సూర్యకిరణాలతో తిలకం
- తిలకించి, పులకించిన భక్తజనం

**అయోధ్య,మార్చి 27**
శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది.



## ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

# 25న పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా



- మేడ్చల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా
- శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన

**నిజామాబాద్,మార్చి 27 :**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లు మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అధ్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది.

మిగతాద్ది 2 లో



2లో..

## నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు
## సిఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

**న్యూఢిల్లీ,మార్చి 27**
నాలుగు రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు.



## పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

- దీంతో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి
- పొలాలు, నీరు కలుషితం అవుతున్నాయి
- లోక్‌సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య డిమాండ్

**న్యూఢిల్లీ,మార్చి 27 :**
పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు.

2లో..

# పశ్చిమాసియాలో ఘర్షణలు

- హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల
- తాజా పరిస్థితులపై సిఎంలో ప్రధాని మోడీ చర్చ



**న్యూఢిల్లీ,మార్చి27**
పశ్చిమాసియాలో ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల కారణంగా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తడంతో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇంధన సంక్షోభంపై చర్చించారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా తక్కిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, ఇంధన సరఫరా స్థిరంగా ఉండేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది.

మిగతాద్ది 2 లో

## పశ్చిమాసియా యుద్ధంతో
# ఇంధన సరఫరాలో సమస్యలు

- సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ
- పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంక్ తగ్గించిన కేంద్రం
- పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం

**న్యూఢిల్లీ,మార్చి 27 :**
పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు.




## నటుడు రాహుల్ రామకృష్ణ కుటుంబంలో విషాదం

- గడ్డి మందు ప్రభావంతో సోదరుడు మృతి
- పారాక్వాట్‌ను నిషేధించాలని రామకృష్ణ బహిరంగ వినతి



**హైదరాబాద్,మార్చి 27 :**
ప్రముఖ నటుడు, సినీ రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మరణించారు. ఈ విషాద వార్తను పంచుకుంటూ రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా చేసిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది.

# కిసాన్‌సాగర్ ఆర్బీఎల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం

**కిసాన్‌సాగర్:**
కరీంనగర్ జిల్లా కిసాన్‌సాగర్ ఆర్బీఎల్ బ్రాంచ్‌లో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 7 మ్యూల్ ఖాతాల ద్వారా రూ.137 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు అధికారులు గుర్తించారు. మ్యూల్ ఖాతాల ద్వారా అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు గుర్తించారు. చైనా వ్యక్తులతో కలిసి బండారి సాయిరామ్ అనే వ్యక్తి మోసాలకు పాల్పడినట్లు తేలింది.ప్రతి లావాదేవీపై క్రిప్టో కరెన్సీ ద్వారా సాయిరామ్ 2 శాతం కమీషన్ తీసుకున్నట్లు బయటపడింది. మొత్తం 8 కేసుల్లో 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం తెలిపారు.“ నిందితులకు సుమారు రూ.2 కోట్ల కమీషన్ వచ్చింది. ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0లో భాగంగా మ్యూల్ ఖాతాల నెట్‌వర్క్ ఛేదించాం. డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు నిందితులుగా ఉన్నారు” అని సీపీ వివరించారు.




## 352 కిలోల కుళ్లిన చికెన్..
# నిందితుడి అరెస్ట్

**సనత్‌నగర్:**



నగరంలోని మూసాపేట పరిధి భరత్‌నగర్‌లో చికెన్ సెంటర్‌పై దాడులు నిర్వహించిన ఆహార కల్తీ నిఘా పోలీసులు నిందితుడు సూరజ్ పాల్‌ను అరెస్టు చేశారు. మొత్తం 352 కిలోల కుళ్లిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ ఉంచి, స్థానిక హోటళ్లు, విక్రేతలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ గడువు ముగిసినట్లు తెలిపారు. నిందితుడ్ని, స్వాధీనం చేసుకున్న వస్తువులను సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

## అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

మొదటిపేజీ తరువాయి
శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆ÷-టో-మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ఎ÷-లాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

## కమనీయం..సీతారామ కళ్యాణం

మొదటిపేజీ తరువాయి
ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

## ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

మొదటిపేజీ తరువాయి
శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

## నటుడు రాహుల్ రామకృష్ణ కుటుంబంలో విషాదం

మొదటిపేజీ తరువాయి
ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పారాక్వాట్ వంటి ప్రాణాంతక రసాయనాలు మార్కెట్‌లో ఎంత సులభంగా అందుబాటులో ఉన్నాయో వివరించాడు. ఈ విషప్రయోగం వల్ల సంభవించే మరణాల సంఖ్యను చూసి వైద్యులు కూడా దిగ్భ్రాంతికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి బహిరంగ విన్నపం చేశారు. పారాక్వాట్ అనేది చాలా శక్తివంతమైన రసాయనమని, దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడం వల్ల ఇది శరీరంలోకి వెళ్ళిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు మరియు కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం మార్కెట్లలోనే కాకుండా ఈ-కామర్స్ సైట్లలో కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని, దీనిని ఆత్మహత్యలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆయన వివరించారు. ఇలాంటి ప్రాణాంతక మందును తక్షణమే నిషేధించి మరిన్ని ప్రాణాలు పోకుండా కాపాడాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. ఇప్పటికే పలు దేశాల్లో నిషేధానికి గురైన ఈ రసాయనంపై భారత్‌లో కూడా ఆంక్షలు విధించాలనే డిమాండ్‌కు నెటిజన్ల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

## పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

మొదటిపేజీ తరువాయి
శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సహా తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలువురు వైద్య నిపుణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ముప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు , వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని.. ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.

### పశ్చిమాసియా యుద్ధంతో
## ఇంధన సరఫరాలో సమస్యలు

మొదటిపేజీ తరువాయి
మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి
డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

### నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు
## సిఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

మొదటిపేజీ తరువాయి
కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

## పశ్చిమాసియాలో ఘర్షణలు

మొదటిపేజీ తరువాయి
అయితే క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారాన్ని ఇప్పటికే కోరింది. పశ్చిమాసియాలో పరిస్థితుల ప్రభావం అంతర్జాతీయంగా అన్ని దేశాలపై పడిందని, భారత్‌పైనా ప్రభావం ఉందని ప్రధాని మోదీ పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రకటించారు. కోవిడ్ మహమ్మారిని సమష్టిగా ఎదుర్కొన్నట్టే తాజా పరిస్థితులను కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కోరారు. టీమిండియా స్పిరిట్‌తో పనిచేసి దేశానికి మారదర్శకంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రులతో మోదీ తాజాగా వర్చువల్ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానమంత్రి నిర్వహించిన వర్చువల్ మీట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, జేకే సీఎం ఒమర్ అబ్దుల్లా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యఘర్ పనులను వేగవంతం చేయాలి
### సిఎండిలను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎండీలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రణాళికాబద్ధంగా పీఎం సూర్యఘర్ కనెక్షన్లను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డిస్కంల సీఎండీలతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై సీఎండీలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించే పీఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతంగా చేపట్టాలని మంత్రి తెలిపారు. జగజ్జీవన్ రామ్ జయంతి నుంచి అంబేడ్కర్ జయంతి నాటికి ప్రతీ నియోజకవర్గంలో కనీసం 2 వేల కనెక్షన్లు పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్‌కు పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ ప్రమాదాలు, ట్రాన్స్‌ఫార్మర్ చోరీలను అరికట్టేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో శాఖాధికారులు, ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## సింహాచలకొండపై వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద దారుణం

- సెక్యూరిటీ సూపర్‌వైజర్‌పై ముసుగుదొంగల దాడి
- గాయపడ్డ లక్ష్మణ్ రావును హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

సింహాచలంలో దారుణం చోటు చేసుకుంది. సింహాచలం కొండపై శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావుపై ముసుగు ధరించిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. కొండ దిగువన ఉన్న ఆలయ ప్రాంగణంలో ఈ ఘటన జరిగింది. కర్రలతో లక్ష్మణరావు ముఖం, తలపై బలంగా కొట్టడంతో.. అతని దవడ ఎముక విరిగి తీవ్ర రక్తస్రావం అయింది. తీవ్ర గాయాలపాలైన లక్ష్మణరావును స్థానికులు వెంటనే గోపాలపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గత పదేళ్లుగా సింహాచలం ఆలయంలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావుపై రెండేళ్ల క్రితం కూడా ఇదే తరహాలో దాడి జరిగినట్లు తెలుస్తోంది. తమ కుటుంబానికి ఆధారం తండ్రి మాత్రమేనని.. దేవస్థానం అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడి కుమారుడు వేడుకున్నారు. విషయం తెలిసిన వెంటనే గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. లక్ష్మణరావుపై గంజాయి గ్యాంగ్ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వరుసగా దాడులు జరుగుతున్నా దేవస్థానం అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంపై ఆలయ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది.

## స్టీల్ ప్లాంట్ మూసివేత పరిస్థితి రాదు
### రాజ్యసభలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేసే పరిస్థితులు ఉత్పన్నం కావని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. శుక్రవారం రాజ్యసభలో వైకాపా ఎంపీ వైవీసుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. దేశంలో ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న అన్ని స్టీల్‌ప్లాంట్లలో మాదిరిగానే కొన్ని కార్యకలాపాల కోసం కొన్ని ఏజెన్సీల సాయం తీసుకుంటున్నట్లు చెప్పారు. 'రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆస్తులన్నింటినీ ఆ సంస్థ శాశ్వత ఉద్యోగులే నిర్వహిస్తున్నారు. కొన్ని కార్యకలాపాల కోసం కొన్ని ఏజెన్సీల నుంచి సాయం తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వ రంగంలోని ఇతర స్టీల్‌ఎ÷-లాంట్ల తరహాలోనే ఈ చర్యలు ఉన్నాయి' అని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇవి దశలవారీగా ఎ÷-లాంట్‌ను ప్రైవేటీకరించడం కిందికి రావని పేర్కొన్నారు.

## మంచుచరియలు విరిగిపడి ఏడుగురు మృతి

లద్దాఖ్‌లో శ్రీనగర్- లేహ్ హైవేపై జోజిలా పాస్ వద్ద మంచు చరియలు విరిగిపడిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. మంచు చరియల కింద అనేక వాహనాలు చిక్కుకుపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో), పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. మంచును తొలగించడంతోపాటు ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాయి.ఈ ప్రమాదంపై లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని సందర్శించి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సంతాపం ప్రకటించారు. గాయపడిన వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

## గొల్లపల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కెటిఆర్

శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రయాదబద్దంగా పండితులు కళ్యాణతో÷-వసం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాములోరి కల్యాణోత్సవాలకు హాజరైన సందర్భంగా కేటీఆర్‌కు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు

## వరంగల్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట-వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35-40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఏపీ ఎక్స్‌ప్రెస్ కిందపడి మృతి చెందాడు. రైలు కింద పడటంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు క్రీమ్ కలర్ ఫార్మల్ ప్యాంట్, యాష్ / బ్లూ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. సుమారు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, ఎరుపు వర్ణం, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుడి చేతి పైన ఇంగ్లీష్ పచ్చబొట్టు తప్ప మరే ఇతర ఆధారాలు లభించలేదు. రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచి, దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు. 9701747014, 8712658627 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

## రాయవరం ప్రమాదంలో బస్సు యజమాని అరెస్ట్

మార్కాపురం బస్సు ప్రమాద ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బస్సు యజమాని, డ్రైవర్ పి.హరికృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రాయవరం వద్ద గురువారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు- కంకర టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. బస్సు ప్రమాద సమయంలో హరికృష్ణారెడ్డి డ్రైవింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం తర్వాత ప్రయాణికులను వదిలేసి అతడు పరారయ్యాడు. నెల్లూరుకు పారిపోతుండగా గురువారం సాయంత్రమే పామూరు శివారులో పోలీసులు అతడిని పట్టుకున్నారు. ఇవాళ సాయంత్రం మార్కాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది.

## ప్రజాసేవే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలు

- కుప్పంలో పలువురికి కుట్టుమిషన్లు పంపిణీ

కుప్పం నియోజకవర్గంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30 మందికి తోపుడు బండ్లు, పలువురికి వినికిడి మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను భువనేశ్వరి వివరించారు. ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ పనిచేశారని భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 29 సంవత్సరాలు పూర్తయిందన్నారు. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల ట్రస్ట్ బాధ్యతలు తనకు అప్పగించారని అన్నారు. చంద్రబాబు అందించిన స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు తమ వంతు సాయం అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కూడా తలసేమియా సెంటర్లు ప్రారంభిస్తామని నారా భువనేశ్వరి ప్రకటించారు.

## దేశంలో ఎరువుల కొరత లేదు
### తగినన్ని నిల్వలు ఉన్నాయి

దేశంలో ఎరువుల కొరత లేదని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సబకు తెలిపారు. దేశంలో అవసరమైన నిల్వలు ఉన్నాయని అన్నారు.పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు తగ్గట్టు సరఫరా చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు. ముడిసరకుల దిగుమతి విషయంలో ఒక్క దేశం పైనే ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ విషయంలో ఇప్పటికే అనేక దేశాలతో భారత్ సుదీర్ఘకాలానికి ఒప్పందాలు చేసుకుంది. ఔషధాల తయారీ కోసం ఇతర దేశాల నుంచి ముడిసరకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం అని జేపీ నడ్డా లోక్‌సభలో వివరించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో నిత్యావసరాలు, ఎరువుల సరఫరా గురించి చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఖరీఫ్ సీజన్ వరకూ ఎరువులకు కొరత ఉండదు. కానీ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ప్రపంచవ్యాప్తంగా ఎరువుల వాడకంలో భారత్ రెండో అతిపెద్ద దేశం. ఫెర్టిలైజర్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉంది. ఎల్ఎన్‌జీ ధరల పెరుగదల కారణంగా యూరియా ఉత్పత్తి వ్యయాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. అదే సమయంలో, ఎరువులు, ముడి పదార్థాల రవాణా ఆలస్యం అవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# రాష్ట్ర వ్యాప్త పర్యటనకు గుర్రపు యాత్ర ప్రారంభించిన జేపీసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు

**- భద్రాచలం దేవాలయ ప్రాంగణంలో భక్తులచే రైతుల మహాగర్జన పోస్టర్ ఆవిష్కరణ**
**- హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి**
**- రైతు ప్రజాసంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**






**కరపత్రం ప్రతినిధి భద్రాచలం:** అన్న దాతలకు, విద్యార్థులకు, వివిధ కుల సంఘాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరామ నవమి పండుగ సందర్భంగా భద్రాచల సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో వేకువ జామున కరీంనగర్ లో లక్షలాది మంది రైతులతో రైతు ప్రజాసంఘాల జేపీసీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రైతుల మహాగర్జన సమర భేరి సభ విజయవంతం చేయాలని పోలాడి రామారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో భక్తుల తో కలిసి మహాగర్జన గోడ ప్రతులను రామారావు ఆవిష్కరించారు. సభ విజయవంతం చేయడానికి భద్రాచల దేవాలయ ప్రాంగణం ముందర గుర్రం ఎక్కి పోలాడి రామారావు ఉమ్మడి రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 శాతం మిగిలి ఉన్న రెండు లక్షల రుణ మాఫీకి నిధుల కేటాయింపు చేయలేదని, బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి నిడుదల కేటాయింపులు తగ్గించిన ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీల ఊసే లేదని, అన్ని రకాల పంటలకు 500 రూ బోనస్ ఇవ్వకుండా కేవలం సన్న రకాలకు అడపా దడపా అర కోరగా ఇస్తూ మోసాగించిందన్నారు. ఇప్పటికే రెండుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిన ప్రభుత్వం నామ మాత్రంగానే విడుదల చేసి రైతులను దేహీ అనే విధంగా హీనంగా పరిగణించే సర్కార్ కు రైతన్నల ఉసురు తగలక తప్పదని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ నిడుదల విడుదల చేయడం లేదని అన్నారు. నామ మాత్రంగానే ఓసి రెడ్డి కార్పొరేషన్ లను ప్రకటించిన ప్రభుత్వం పాలక మండళ్లు ఏర్పాటు చేయలేదని, బడ్జెట్లో లో నిడుదల కేటాయించక రెడ్డి ఓసి లను మోసగించిందన్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అన్నీ వర్గాల కుల సంఘాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 28 న ఓసి జేపీసీ రైతు ప్రజాసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో లక్షలాది మంది తో రాష్ట్ర స్థాయి రైతుల మహాగర్జన సమరభేరి సభను నా భూతో న భవిష్యత్ తరహా లో నిర్వహిస్తున్నామని పార్టీల కతీతంగా అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానిస్తున్నామని శరవేగంగా సన్నాహక ఏర్పాట్లు జరుగుతున్నాయని పోలాడి రామారావు తెలిపారు. కరీంనగర్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి రైతుల మహాగర్జన సమర భేరి సభలో ఈ క్రింది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నాం. రైతుకు పూర్తిగా 2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులను పంట సాగు సమయంలోనే విడుదల చేయాలని ఇచ్చిన హామీల మేరకు అన్ని రకాల పంటలకు క్వింటాలుకు 500 బోనస్ ను ధాన్యపు కొనుగోలు సమయంలోనే చెల్లింపులు చేయాలనీ కౌలు రైతులకు హామీ నెరవేర్చాలన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న మద్దతు ధర కాకుండా రైతుకు పెట్టుబడి తగ్గట్టుగా గిట్టుబాటు ధర అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలి, ఆయకట్టు చివరి భూముల వరకు నీళ్లు అందించే విధంగా వాటర్ మేనేజ్మెంట్ చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత ఉన్నందున జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే వ్యవసాయానికి అనుసంధానం చేయాలి, రైతు బీమా వయోపరిమితిని 59 ఏళ్ల నుండి 70 ఏళ్ల వరకు పెంచాలి 50000 ఏదైనా ప్రతి రైతుకు నెలకు 6000 రూపాయల జీవన భృతి కల్పించాలి. ప్రతి రైతుకు ఆరోగ్య సమస్యల చికిత్స నిమిత్తం 20 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయాన్ని కార్పొరేట్ హాస్పిటల్ లో అవకాశం కల్పించాలి, నామమాత్రంగా ఏర్పాటు చేసిన రెడ్డి కార్పొరేషన్ కు తక్షణమే నిధులు కేటాయించి పాలకమల్ని ఏర్పాటు చేయాలి. రైతులకు వ్యవసాయ యాంత్రికరణ డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను 75% సబ్సిడీతో అందించాలి, ఆర్థికంగా వెనుకబడిన అగ్రకుల పేదల సంక్షేమానికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పటిష్టమ అమలుకై జాతీయ రాష్ట్రస్థాయి ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలి. ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయం ఒకే రకమైన వార్షిక ఆదయ పరిమితిని పెంచాలి. ఈడబ్ల్యూ ఎస్ అర్హతకు అధికారులు జారీ చేసే సర్టిఫికెట్ కఠిన షరతులు లేకుండా ఐదు సంవత్సరాల వరకు పరిమితి ఉండేలా వర్తింప చేయాలి. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనకు ఇచ్చిన హామీ మేరకు ఏటా జాబు క్యాలెండర్ ప్రకటించి భర్తీ చేయాలని ప్రభుత్వాలను రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఓసి జేపీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజా సంఘాల అధ్యక్షుడు పెండ్యాల రాంరెడ్డి , ప్రజా సంఘాల జాతీయ నాయకులు సాంబశివరావు, నాయకులు అయిత నాగరాజు, రాజయ్య అంజయ్య తదితరులు ఉన్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణం..



**కరపత్రం ప్రతినిధి-హుజురాబాద్:** మండలంలోని చిన్న పాపయ్యపల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ చల్లూరి చిరంజీవి ఆధ్వర్యంలో ఈ కళ్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులంతా హాజరై సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాలెల్మ గ్రామంలో ఘనంగా సీతా రాముల కళ్యాణం





**కరపత్రం ప్రతినిధి అందోలు** అందోలు మండలం తాలెల్మ గ్రామంలో శుక్రవారం హనుమాన్ మందిరం ఆవరనలో ముత్యాల పందిరి వేసి భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా సీతా రాముల కళ్యాణం జరిపారు. మహిళలు దీర్ఘ సుమంగళిగా జీవించాలని కోరుకుంటు స్వామి వారికి ఓడి బియ్యం సమర్పించారు. అనంతరం సీతా రాముల ప్రతిమలను గ్రామ వీధుల్లో భజనలు చేసుకుంటు గ్రామస్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించిన హనుమాన్ మందిరం కమిటీ సభ్యులను, భజరంగ్ దల్ సభ్యులను, గ్రామ పెద్దలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు మహిళలు యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, మహిళలు, భజరంగ్ దల్ సభ్యులు, హనుమాన్ మందిరం కమిటీ సభ్యులు. ఆర్.రాజగౌడ్ మర్పల్లి శేఖర్ గౌడ్ లింగన్నగారి ప్రసాద్ గౌడ్,శంకర్ , యాదయ్య , రవి, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి కావడం లేదని మనస్థాపనతో యువకుడి ఆత్మహత్య



**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మార్చి 27** నిశ్చితార్థం జరిగి పెళ్లి ఎత్తిపోవడంతో ఓయువకుడు విషంతాగిఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని ఎదు లపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన దాసరి విజయ్( 24 ) గత కొద్ది రోజుల క్రితం తమ బంధువుల అమ్మాయితో పెళ్లి సంబంధం కుదిరించుకున్ననిశ్చితార్థం జరిగి పెళ్లి ఎత్తిపోవడంతో మనస్థాపానికి గురై గురువారం మధ్యాహ్నం తమ వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు సేవించాడు అనిగమనించిన కుటుంబీకులు గ్రామస్తులు విజయ్ నీచికిత్స నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించగాపరిస్థితివిషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూవిజయ్ శుక్రవారం నాడుమృతి చెందారు. మృతుడి తల్లిదండ్రులు శ్రీహరి సుగుణ లు పోరున విలపించారు. మృతుడికి ఓ సోదరుడు ఉన్నారు. విజయ్ మృత్తితో ఎదులపల్లిలో విషాదం ఛాయలు నెలకొనగా కుటుంబ సభ్యుల బంధువుల స్నేహితుల రోదనలు నిన్నంటాయి. ఇలాంటి దుర్ఘటన గ్రామంలో ఊరికి రావద్దని పలువురు గ్రామస్తులు తెలియజేశారు

## ముస్లిం మహిళ చేత సీతారాముల వారికి పట్టు వస్త్రాల సమర్పణ

**- సాంప్రదాయాలకు మించిన సౌహార్దానికి నిదర్శనం**



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 27**
అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఈసారి భక్తి, భవ్యం మాత్రమే కాదు... సామరస్యానికి, మత సామరస్యానికి కూడా అద్భుతమైన సందేశాన్ని అందించింది. జమ్మికుంట పట్టణానికి చెందిన ముస్లిం మహిళ అబిదా భాను స్వచ్ఛమైన భక్తితో స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం విశేషంగా నిలిచింది.

ఈ ఘటన అక్కడికి విచ్చేసిన వేలాది మంది భక్తులను ఆశ్చర్యానికి గురిచేయడంతో పాటు ఆనందభాష్పాలు పెట్టించింది. మతాల మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా, భక్తి ఒక్కటే ప్రధానమని అబిదా భాను తన చర్య ద్వారా సమాజానికి స్పష్టమైన సందేశాన్ని అందించారు.

ఈ సందర్భంగా అబిదా భాను మాట్లాడుతూ -- "స్వామివారిపై నాకు ఎంతో భక్తి, నమ్మకం ఉంది. నా చేతులతోనే తయారు చేసిన పట్టు వస్త్రాలను సమర్పించడం నాకు గర్వంగా ఉంది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇక నుండి ప్రతి సంవత్సరం జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవానికి తప్పకుండా హాజరవుతూ, పట్టు వస్త్రాలు సమర్పిస్తాను" అని తెలిపారు. ఆమె మాటల్లో కనిపించిన ఆత్మీయత, భక్తి అక్కడున్న ప్రతి ఒక్కరినీ కదిలించింది.

అబిదా భాను చేసిన ఈ సేవ కేవలం ఒక సంప్రదాయం పాటించడం మాత్రమే కాకుండా, మతాల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరిచేలా నిలిచింది. హిందూ దేవాలయంలో ముస్లిం మహిళ ఈ విధంగా పాల్గొనడం సమాజానికి గొప్ప సందేశాన్ని అందించింది. "మతం మనుషులను విడదీయదు... మనుషులే మతాలను విడదీస్తారు" అనే మాటలను నిజం చేస్తూ ఆమె చర్య నిలిచింది.

ఇల్లందకుంట సీతారాముల కళ్యాణం ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా జరుగుతుండగా, ఈసారి అబిదా భాను చేసిన సమర్పణ ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆమెను ఆలయ అర్చకులు, నిర్వాహకులు సత్కరించగా, భక్తులు హర్షధ్వానాలతో అభినందించారు.

గ్రామస్థులు, పట్టణ ప్రజలు కూడా అబిదా భాను సేవను ప్రశంసిస్తూ -- "ఇలాంటి సంఘటనలు సమాజానికి ఎంతో అవసరం. మత సామరస్యానికి ఇది ఒక గొప్ప ఉదాహరణ" అని పేర్కొన్నారు.

ఇప్పటి కాలంలో మత వివాదాలు పెరుగుతున్న తరుణంలో, అబిదా భాను లాంటి వ్యక్తులు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. ఆమె చూపించిన మార్గం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని స్థానికులు ఆకాంక్షించారు.

ఇలా భక్తి, మానవత్వం, సౌహార్దం కలిసిన ఈ ఘటన ఇల్లందకుంట సీతారాముల కళ్యాణ మహోత్సవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

## కళ్యాణం కమనీయం -- సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవం







**కరపత్రం ప్రతినిధి ఇల్లంతకుంట మార్చి 27**
రామనామ స్మరణతో మారుమ్రోగిన ఇల్లందకుంట అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ వేడుకలు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పణ ఉచిత మజ్జిగ పంపిణీతో భక్తులకు చల్లని ఉపశమనం అన్నదానం ద్వారా భక్తుల సేవలో ముందున్న మిల్లర్లు అపర భద్రాద్రిగా ఖ్యాతి గాంచిన ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం శుక్రవారం రోజు భక్తుల సందడితో కిటకిటలాడింది. శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తి భావనల నడుమ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టువస్త్రాలు మరియు ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇలాంటి పవిత్ర కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. శ్రీరాముడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కళ్యాణ వేడుకలు ఆద్యంతం "రామ నామం" నినాదాలతో మారుమ్రోగి, భక్తుల హృదయాలను ఆధ్యాత్మిక ఆనందంతో నింపాయి. వేదమంత్రాల నడుమ జరిగిన ఈ కల్యాణం దర్శనార్థం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు చల్లని ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, జమ్మికుంట ప్రాంతానికి చెందిన రైస్ మరియు కాటన్ మిల్లర్లు ప్రతి సంవత్సరం భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేయడం విశేషం. ఈ సేవా కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు ఇంచార్జి ప్రణవ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మహోత్సవంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, ఆలయ చైర్మన్ ఇంగిలి రామారావు, హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అలాగే భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తి, సంప్రదాయం, సేవా భావం కలిసిన ఇల్లందకుంట సీతారాముల కల్యాణం -- నిజంగా కమనీయమైన ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది.

## శ్రీరామ నవమి సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను అభినందించిన నగర మేయర్ కలగాని శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 27**
శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా కొక్కెరకుంట, వన్నారం గ్రామాలలో , కరీంనగర్ లలో ఎస్ ఆర్ ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన సేవా కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయమని మేయర్ కులగాని శ్రీనివాస్ అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు అందించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా శుభ్రత కార్యక్రమాలు, ప్రజలకు సహాయక చర్యలు, సామాజిక బాధ్యతతో నిర్వహించిన సేవలు యువతలో ఉన్న సేవా భావాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పిఓ లు బి .ఎలిజబెత్ రాణి ,డాక్టర్ కే .అర్జున్ ఆధ్వర్యంలో నడిచిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలను మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజేందర్ ,శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు

- కాంగ్రెస్ పార్టీ కనుమరుగయ్యే తరుణంలో పార్టీని కాపాడిన అఖండుడు
- గ్రామాల అభివృద్ధి తన ధ్యేయమని ప్రజల కష్టసుఖాలను తెలుసుకునే ఆపద్బాంధవుడు

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మార్చ్ 27**

మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన ఆవుల రాజు రెడ్డి జన్మదిన వేడుకలను వెల్దుర్తి మండల కేంద్రంలోని స్థానిక ఆటో స్టాండ్ వద్ద ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకున్న వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి వెల్దుర్తి మాజీ వైస్ ఎంపీపీ అంగడిపేట సుధాకర్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నరసింహ రెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కొమిరి శెట్టి నంబూద్రి సొసైటీ మాజీ డైరెక్టర్ నాలా చెరువు కిష్టా గౌడ్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నాలాచెరువు శేఖ గౌడ్ వెల్దుర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హౌసుల మల్లేష్ చారి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ముక్తాబాయ్



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సొసైటీ డైరెక్టర్ గూడెం పోతిరెడ్డి అందుగులపల్లి శ్రీనివాస్ శెట్టిపల్లి వెంకటరెడ్డి పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ ఆపద్బాంధవుడిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ అంటేనే ఆవుల రాజిరెడ్డి అని నర్సాపూర్ నియోజకవర్గంలో కనుమరుగు అవుతున్న కాంగ్రెస్ పార్టీని కరడు కట్టిన కరుణామయునిగా కాంగ్రెస్ పార్టీని కాపాడిన కరుణామూర్తి అని ఆవుల రాజిరెడ్డి లేకుంటే కాంగ్రెస్ పార్టీ కనుమరుగయ్యేదని వారు తెలియజేశారు ఆయన తెలంగాణ రాష్ట్రంలో మూడవసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫునుండి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓటమి పాలు అయినా కూడా ఆయన కాంగ్రెస్ పార్టీ అంటే నే తన కుటుంబముగా భావించి మరల ఆయన పార్టీ కార్యకర్తల కోసం నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్న తాను వారి సమస్యలు తెలుసుకుని అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియజేసి గ్రామాల అభివృద్ధి చేయడమేతన ధ్యేయంగా తాను ముందుకు వెళ్తున్నారాని అలాంటి ఆయనను ప్రతిపక్ష నాయకులు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆయనను రాజకీయపరంగా ఎదగకుండా చేస్తున్నారని అలాంటి ఆరోపణలు ప్రతిపక్ష నాయకులు మానుకోవాలని ఆయన వెంటనే ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలం ఉంటామని ఆయన మా వెంటే ఉంటూ మాకు ఎంతో ధైర్యం చెప్పడమే కాకుండా తాను నిరుపేద ప్రజలకు ఎటువంటి ఆపదలు ప్రమాదాలు జరిగిన కూడా తాను సమయపాలన లేకుండా వారిని పరమాశించి వారికి మనోధార్యాన్ని ఇవ్వడమే కాకుండా వారికి ఎంతో కొంత సహాయ సహకారాలు అందించడం ఆయనకు ఉన్న గుణతత్వం అలాంటి వ్యక్తిని ప్రతిపక్ష నాయకులు ఎలాంటి ఆరోపణలు చేసినా కూడా పట్టించుకోని మంచి మనస్తత్వం ఉన్న నాయకుడు కాంగ్రెస్ పార్టీలో ఉండడం కాంగ్రెస్ పార్టీకి ఎంతో గౌరవం అని వారి ఆధ్వర్యంలోనే వెల్దుర్తి మండల కేంద్రంలో 72 ఇందిరమ్మ ఇండ్లు తీసుకురావడం జరిగిందని వారు తెలియజేశారుఆయన జన్మదినం శుక్రవారం నాడు జరుపుకోవడం మాకు ఎంతో అదృష్టకరమని ఆయన రానున్న రోజుల్లో రాజకీయపరంగా ఎంతో ఎదగాలని ఆయన జన్మదినం శ్రీరామనవమి రోజు జరుపుకోవడం మరింత విశేషమైన కార్యక్రమమని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తెలియజేశారు రానున్న ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫునుండి అభ్యర్థులుగా నిలబడిన వారికి ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అండగా ఉంటూ వారి గెలుపుల కోసమే కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలియజేశారు గత సర్పంచ్ ఎన్నికల్లో జరిగినటువంటి గ్రామంలో తాను ప్రతి ఒక్క గ్రామానికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులుగా నిలబడిన వారికి ఎంతో ప్రోత్సాహాన్నిధైర్యాన్ని ఇచ్చుకుంటూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ గా గెలుపొందితే తమ గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన ప్రచారాలలో సర్పంచ్ అభ్యర్థిగా నిలబడిన వారికి తెలపడమే కాకుండా వారి గెలుపు కోసం తాను ఎంతో కృషి కూడా చేశారని అలాంటి మహానుభావులపుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల అదృష్టమని వారు తెలియజేశారు

# ఆర్.జి.1 ఏరియాలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 27:**

అంతర్జాతీయ వుహిళా దినోత్సవమును పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి, లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బంగ్లోస్ ఏరియా పార్కులో గురువారం అట్టహాసంగా ఆర్జీ.1 సేవా సమితి అధ్యక్షురాలు డి.అనిత లలిత్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిదులుగా స్థానిక యం.యల్.ఎ రామగుండం నియోజకవర్గ సతీమణి మనాలి టాకూర్, రామగుండం మున్సిఫల్ కమిషనర్ జె.అరుణశ్రీ, కమిషనర్ ఆఫ్ పోలీస్ సతిమతి డాక్టర్ త్రిప్తిజా, ఆర్జీ.1 ఏరియా జిఎం డి.లలిత్ కుమార్, ఆర్జీ.2 ఏరియా సేవా అధ్యక్షురాలు వనజ వెంకటయ్య పాల్గొని మొదట జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భముగా రామగుండం మున్సిఫల్ కమిషనర్ జె.అరుణశ్రీ మాట్లడుతూ మా కుటుంబములో ముగ్గురము అమ్మయిలము అయిన కుడా మాకు ఎంతో స్వేచ్ఛా స్వాతంత్ర్యము ద్వారా మా అమ్మగారు గొప్పగా తీర్చిదిద్ది ఉన్నతంగా ఈరోజు ఉన్నందుకు ఎంతో గర్వకారణంగా ఉన్నదని ఇక్కడి వారికి స్వయం ఉపాది కొరకు సింగరేణి సేవా సమితి తోడ్పాటు అందిస్తున్నదాని దీనిని అందరు




సద్వినియోగాపర్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అథితి మనాలి టాకూర్ మాట్లాడుతూ రామగుండం నియోజక వర్గంలో ఎన్నో ఏరియాల ప్రజల యొక్క కష్టాలూ గమనించానని, ఎక్కడ లేని విధంగా సింగరేణి సేవా సమితి ద్వారా అర్జి.1 సేవా అధ్యక్షురాలు ఇక్కడ ఉన్న మహిళలకు వివిధ శిక్షణలు ఇస్తూ వారిలోని నైపుణ్యాన్ని బయటికి తీస్తూ వారికి సహకరిస్తూ వారిలో మనోస్థైర్యం నింపుతూ స్వయం ఉపాది కలిపిస్తున్నారని కొనియాడారు. ఒక మహిళకు అవకాశం ఇస్తే ఆకాశాన్ని కూడా హద్దుగా చేసుకొని ఉన్నతంగా ఎదుగుతారని తెలిపారు. ఆలాగే సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ మాట్లడుతూ స్త్రీలు తల్లిగా చెల్లిగా భార్యగా వివిధ భాధ్యతలు పోషిస్తూ వారి పిల్లలను తీర్చి దిద్దుతూ ఉన్నతంగా ఎదుగుటకు ఇలా.. రకరకాలగా పోషించుతూ.. సమన్వయముతో తనదైన శైలిలో సమయంతో పరుగులు తీస్తూ.. అందరికీ కావలసినవి సకాలంలో అందిస్తూ... అక్షయపాత్రలా అందరికీ అన్ని అందిస్తున్న స్త్రీమూర్తులందరికీ వందనం తెలిపారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ప్రతి ఒక్క మహిళా కష్టపడి ఉన్నత స్థానాలను అధిరోహించాలని. పస్తుతం మహిళలు పురుషులకు సమానంగా అన్నీ రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సేవా సభ్యులు, లేడిస్ క్లబ్ అద్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ హోదాలలో సేవలందించిన మహిళలకు మియు ముఖ్య అథితులకు సన్మానం చేసి బొకేలు మరియు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమములో సి.ఎం.ఓ.ఐ ప్రసిడెంట్ బి.మల్లేశం, యస్.ఓ.టు. జియం చంద్ర శేఖర్ పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పి.ఓ హన్మంతరావు, సేవా సెక్రటరీ బీనాసింగ్, జాయింట్ సెక్రటరీ రజిత, లేడిస్ క్లబ్ సెక్రటరి శిరీష చంద్ర శేఖర్, సేవా శిక్షకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# అందోలు జోగిపేట మున్సిపల్ చైర్మన్ క్రిష్ణ రెడ్డి చేతుల మీదుగా మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**కరపత్రం ప్రతినిధి అందోలు**



అందోలు జోగిపేట మున్సిపల్ పట్టన కేంద్రంలో అబ్దుల్ రెహమాన్ (చోటు) ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను మున్సిపల్ చైర్మన్ ఎస్. క్రిష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురోత్తం రెడ్డి, అల్లె శ్రికాంత్, మైనారిటీ నాయకులు చోటు ఖాన్, ఆలి అబ్బాస్, శంషీర్ బేగ్, నదీర్ తదితరులు పాల్గొన్నారు.

# రాములోరి కళ్యాణంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్- శైలజ దంపతులు

**కరపత్రం ప్రతినిధి మంథని మార్చి 27**



శ్రీరామనవమి సందర్భంగా మంథని మండలం రచ్చపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ లో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్–శైలజ దంపతులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. మంథని మండలం రచ్చపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ లోని శ్రీ కోదండ రామాలయం లో సీతారాముల కళ్యాణం వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులకు నిర్వాహకులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు సంప్రదాయ పద్ధతిల్లో జరిగిపిన శ్రీ సీతారాముల కళ్యాణ తంతును వారు తిలకించారు.

# రామ-చంద్ర పట్టాభిషేకంకై ఎదురుచూస్తున్న ప్రజలు..

**- తెలంగాణలో రావణ పాలన అంతంకై.. వానర సైన్యం వలె కార్యకర్తలు ఉద్యమించాలి..**
**- శ్రీరామనవమి సందర్భంగా రామగుండం నియోజకవర్గంలో మజ్జిగ, చలివేంద్ర కేంద్రాలు ప్రారంభించిన వ్యాల్ల హరీష్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 27:**

వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ని పురస్కరించుకొని శ్రీ సీతారామ కళ్యాణం మహోత్సవానికి విచ్చేస్తున్న ప్రజలు భక్తులు మహిళలకు దాహార్తి తీర్చాలనే సంకల్పంతో రామగుండం నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాల వద్ద జరిగే కళ్యాణోత్సవ వేడుకలలో ఉచిత మజ్జిగ, చలి వేంద్ర కేంద్రాలు ప్రారంభించామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎనిమిదవ కాలనీ, గోదావరిఖని కోదండ రామాలయం, గంగానగర్ చంద్రశేఖర్ నగర్ లో అన్న ప్రసాదం తో పాటు గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని ఐబి కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కళ్యాణోత్సవానికి వచ్చే ప్రజలకి ఉచిత, మజ్జిగ పంపిణీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ సీతారామచంద్ర కళ్యాణ మహోత్సవం రామచంద్రుడి





పట్టాభిషేకం భక్తులు ఆశీర్వచనం పొందేందుకు పెద్ద సంఖ్యలో వస్తారని వారి సౌకర్యార్థమే వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నామని అన్నారు. అలాగే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు ఎగవేసి, రైతులకు రైతుబంధు మోసం, మహిళలకు పింఛన్లు, నిరుద్యోగులకు టోకరా పెట్టిన రావణ పాలన అంతం కొరకు ఎదురుచూస్తున్నారని, రాబోయే తెలంగాణ ప్రభుత్వం లో రామ-చంద్ర (కేటీఆర్-కెసిఆర్) పట్టాభిషేకం కై భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు ఉద్యమించాలని ప్రజల అభీష్టం మేరకు రామచంద్ర పట్టాభిషేకం నిర్వహించేలా కంకణబద్ధులై ముందుకు సాగాలని హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల కోరికలు సిద్ధించేలా రైతులు మంచి లాభసాటి వ్యవసాయం పొందేలా సీతారామాంజనేయ స్వామి ఆశీస్సులు అందించాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగాజమున తహజీబ్ ముస్లిం లు పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమాలలో రామగుండం కార్పొరేషన్ మాజీ కో అప్షన్ మెంబర్ తస్నింబాను జాహిద్ పాషా, అక్బర్, అబ్దుల్ కదీర్, తహసీన్, మొయిన్ రాజ్ మొహమ్మద్, పొలాడి శ్రీనివాస్ రావు, బూరుగు వంశీ క్రిష్ణ, మేకల రామస్వామి, బొట్ల పోషం, కడమండ్ల శ్రీహరి, చొప్పరి శ్రీనివాస్, కొండా సురేష్, బొబ్బిలి సతీష్,కడార్ల శ్రీధర్, బండి రాజు, మహమ్మద్ షఫీ, అక్బర్, మొయిన్ పాషా, సిగిరి రాము, దాడి తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# 11వ డివిజన్లో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి..



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 27:**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్లో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని నాయకులు కోరారు. ఈ మేరకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్లో రాంనగర్, సంజయ్ నగర్, జ్యోతినగర్, కృష్ణనగర్, భగత్సింగ్ నగర్, ఫైవింక్లయిన్ కాలనీ ప్రాంతాలున్నాయనీ, ఈ ప్రాంతాల్లో అత్యధికులు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారే నివాసముంటున్నారు. నిరుపేదల కాలనీలు కావడంతో రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఏదైన శుభకార్యక్రమం, ఇతర ఏ కార్యక్రమాల నిర్వహణ చేయాలన్నా నిరుపేదలైన డివిజన్ ప్రజలు ఫంక్షన్ హాల్స్లో నిర్వహించే స్థోమత లేక ఇరుకు ఇండ్ల మధ్య రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. దీంతో అందరికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అంబేద్కర్ కమ్యూనిటీహాల్ ఉన్నట్లయితే డివిజన్ ప్రజల సమస్యకు పరిష్కారం ఏర్పడుతుందన్నారు. కావున రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్లో ఎస్సీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ ప్రజా ఐక్య వేదిక నాయకులు లంక సురేష్, గడ్డం శంకర్, శ్రవణ్, లక్క శ్రావణ్ గౌడ్, గడ్డం రమేష్, బుర్రి సదానందం, సిరికొండ సదానందం, బూడిద సురేష్, అంకూస్, చంద్రగిరి అంకూస్, గడ్డం రాంచందర్ పాల్గొన్నారు.

# కళ్యాణం కమనీయం..

**- అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 27:**

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని పట్టణంలోని కాకతీయ నగర్ భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో భద్రాచలంలో మాదిరిగానే గత 17 సంవత్సరాల నుంచి ఈ సంవత్సరంతో 18వ సంవత్సరం 18 శక్తి పీఠాల మాదిరిగానే ఆలయ ప్రధాన అర్చకులు బూర్ల గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అభిజిత్ లగ్న మూర్తన అంగరంగ వైభవంగా కన్నుల పండుగ శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు, ఆలయ ప్రధాన అర్చకులతో పాటు నూతి అంబాదాసు నెల్లి లక్ష్మీనారాయణ



పవనశర్మ ఆడేపు శ్రీరాములు చాణక్య శర్మ బండారి రాజమల్లు శ్రీరాముల శర్మ, తదితర వేద పండితుల మధ్య అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు వేలాది మంది భక్తులు పాల్గొని వారి ముక్కులను ఆ సీతారాముల సాక్షిగా మొక్కుకున్నారు, వారి కుటుంబాలు పిల్లాపాపలు వారి గ్రామాలు తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో సకల జీవులు సకల ప్రాణులు సంతోషంగా ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు ఆ సీతారాముల కళ్యాణం సాక్షిగా వారి వారి మొక్కులను మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు దాట్ల జేమ్స్ రెడ్డి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య యాదవ్, బారసా నాయకులు నీరటి శ్రీనివాస్, గొర్రె నర్సింగరావు, మొలుగూరి మహేష్, కాకతీయ నగర్ బస్తి వాసులు ఉప్పరి మల్లమ్మ, ఆగయ్య, గొర్రె రామచందర్ తదితరులు పాల్గొన్నారు